సాక్షి
పెద్దపల్లి

సోమవారం। 4। డిసెంబర్। 2023




ఎమ్మెల్యేలుగా విజయం సాధించాక అధికారుల నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పేదల సంక్షేమానికి కృషి



మంథని : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను తన చేతిలోకి తీసుకొని చేసిన అరాచకాలను ప్రజలు గుర్తు పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకున్నారు. మంథనిలో రౌడీయిజం, గూండాయిజం ఉండకూడదని, ఇక్కడ శాంతి నెలకొనాలని ప్రజలు తీర్పు ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పిస్తాం. ఆరు గ్యారెంటీలతోపాటు మేనిఫెస్టోలోని అన్ని హామీలు అమలు చేస్తాం. ధరణి, సాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం తదితర రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నా విజయానికి సహకరించిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అన్నివర్గాల ప్రజలకు కృతజ్ఞతలు.

– దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే

అధైర్యపడొద్దు



మంథని : అధికారం ఉన్నా, లేకున్నా ఎప్పటిలాగే నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటా. నా కోసం కష్టపడ్డ ప్రతీకార్యకర్తకు అండగా ఉంటా. ఎవరూ అధైర్యపడవద్దు. అందరికీ అందుబాటులో ఉంటా.

– పుట్ట మధు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి

ప్రజాభీష్టమే శిరోధార్యం



గోదావరిఖని : ప్రజల అభీష్టానికి అనుగుణంగా ముందుకు సాగుతా. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చుతా. గడీల, దోపిడీ పాలనకు ప్రజలు స్వస్తి పలికారు. ఈప్రాంతంలో జరిగిన దోపిడీకి వ్యతిరేకంగా అన్నివర్గాలు ఉత్సాహంగా నాకు ఓటువేశారు. సుమారు లక్ష మంది ఓటర్లు నాకు మద్దతు పలకడం సంతోషంగా ఉంది. నా వెన్నంటి ఉన్న అన్నివర్గాలకు కృతజ్ఞతలు.

– మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

ప్రజాతీర్పు శిరసావహిస్తా



గోదావరిఖని : ప్రజల తీర్పు శిరసావహిస్తా. ఓటమికి గల కారణాలు విశ్లేషించుకుంటాం. నాకు మద్దతుగా నిలిచి అహర్నిశలు శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాలకు కృతజ్ఞతలు. ఉద్యమ నాయకుడిగా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల్లో ఉంటా. నేను ఇచ్చిన హామీల మేరకు అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేశా.

– కోరుకంటి చందర్, సమీప అభ్యర్థి

ప్రజల ఆశీర్వాదమే..



పెద్దపల్లిరూరల్ : తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందే కాంగ్రెస్. అదే విషయాన్ని ప్రజలకు వివరించాం. ఈసారి ప్రజలు వాస్తవాలు గ్రహించి కాంగ్రెస్‌కే అండగా నిలిచి నాకు అఖండ మెజార్టీ కట్టబెట్టారు. వారిఆలోచనలు, మేమిచ్చిన గ్యారంటీలకు అనుగుణంగా పనిచేసి ప్రజల మెప్పు పొందుతాం.

– విజయరమణారావు

ప్రజలకు రుణపడి ఉంటా



పెద్దపల్లిరూరల్ : పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవచేసే అవకాశం ఇచ్చారు. ఈప్రాంత ప్రజలకు రుణపడి ఉంటా. ప్రభుత్వం అందించిన పథకాలను అర్హులందరికీ అందేలా శాయశక్తులా ప్రయత్నించా. నన్ను రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న ప్రజల రుణం తీర్చుకోలేను.

– ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

మహిళలకు నో చాన్స్

- ప్రధాన పార్టీల నుంచి బరిలో ఐదుగురు
- అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం ఒక్కరికీ దక్కలేదు

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి జిల్లానుంచి ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టి 'అధ్యక్షా' అని పిలవాలనుకున్న మహిళా ఎమ్మెల్యే అభ్యర్థులకు నిరాశే మిగిలింది. ఉమ్మడి జిల్లాలో 14,96,023మంది మహిళా ఓటర్లు ఉండగా, బీజేపీ నలుగురికి, బీఎస్పీ ఒకరికి పోటీచేసేందుకు అవకాశం కల్పించాయి. బీజేపీ అభ్యర్థులుగా రామగుండం నుంచి కందుల సంధ్యారాణి, సిరిసిల్ల నుంచి రాణిరుద్రమ, జగిత్యాల నుంచి భోగ శ్రావణి, చొప్పదండి నుంచి బోడిగె శోభ, పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థిగా దాసరి ఉష బరిలో నిలిచారు. శ్రావణి ప్రత్యర్థులకు దీటుగా ఓట్లు సాధించగా, మిగిలిన అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి.

హస్తం హవా

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 8 కాంగ్రెస్ .. 5 బీఆర్‌ఎస్ కైవసం

- ఉమ్మడి జిల్లాలో 8 స్థానాలు కాంగ్రెస్ కైవసం
- 2004 ఫలితాలు పునరావృతం
- 5 స్థానాలకే బీఆర్‌ఎస్ పరిమితం
- జగిత్యాలలో తీవ్ర పోటీ ఇచ్చిన జీవన్‌రెడ్డి
- ఎంపీలు అర్వింద్, సంజయ్‌కు పరాజయం
- 19 ఏళ్లలో తొలిసారి ఓడిన ఈటల
- రికార్డులు కోల్పోయిన కొప్పుల, రాజేందర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసెంబ్లీ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఊపిరిపోశాయి. గత 20 ఏళ్లలో ఏనాడూ చూడని స్పష్టమైన సీట్లు రావడం గమనార్హం. 2004లో వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో టీఆర్‌ఎస్–సీపీఐ పొత్తులతో కాంగ్రెస్ కూటమి 10 సీట్లు(కాంగ్రెస్ 5, టీఆర్‌ఎస్ 4, సీపీఐ 1) సాధించింది. ఇప్పుడు 8 స్థానాల్లో విజయకేతనం ఎగరేసి కాంగ్రెస్–సీపీఐ కూటమి సత్తాచాటుకుంది. ప్రధానంగా పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలను కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేసింది. ఇక పొరుగునే ఉన్న ధర్మపురితోపాటు వేములవాడ, చొప్పదండి, మానకొండూరు, హుస్నాబాద్‌నూ కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. 2018 ఎన్నికల్లో 12 స్థానాలు గెలిచిన బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల్లో సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల, కరీంనగర్, హుజూరాబాద్‌తో కలిపి ఐదో స్థానాలకు పరిమితమైంది. ఇక హుజూరాబాద్, కరీంనగర్, కోరుట్లలో బీజేపీ పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి.

బండి.. గంగుల నువ్వా–నేనా..

కరీంనగర్‌లో విజయం చివరి వరకు దోబూచులాడింది. చివరి రౌండ్ వరకు సాగిన ఉత్కంఠ పోరులో తొలుత స్వల్ప ఓట్లతో గంగుల కమలాకర్ విజయం సాధించారు. దీనిపై బండి సంజయ్ అభ్యంతరం తెలుపుతూ కౌంటింగ్ కేంద్రం వద్దకొచ్చారు. పోలింగ్ బూత్ 43, 289లో ఓట్ల లెక్కింపు చేపట్టలేదని ఆరోపించారు. సంజయ్ వినతిని పరిగణనలోకి తీసుకున్న రేకుర్తిలోని లయోల బీఈడీ కాలేజీ రూమ్‌నంబర్ 3లోని 594 ఓట్లు, రాంపూర్‌లోని విద్యార్థి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లోని 697 ఓట్లు లెక్కించారు. చివరకు 3,163 ఓట్ల మెజారిటీతో గంగుల గెలవడంతో ఉత్కంఠకు తెరపడింది.

- ఇక కాంగ్రెస్ అభ్యర్థులు మానకొండూరు–కవ్వంపల్లి సత్యనారాయణ విజయం సాధించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై ఏ దశలోనూ వెనకబడలేదు.
- చొప్పదండి– మేడిపల్లి సత్యం కూడా ప్రతీ రౌండ్‌లోనూ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై ఆధిపత్యం చూపించారు.
- హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి– పాడి కౌశిక్‌రెడ్డి తమ ప్రత్యర్థులపై ఆది నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ అభ్యర్థి ఒడితల ప్రణవ్‌పై స్పష్టమైన ఆధిక్యంతో గెలిచారు.
- పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మంథని– శ్రీధర్‌బాబు, రామగుండం– మక్కాన్ సింగ్, పెద్దపల్లి– విజయరమణారావు నియోజకవర్గాల్లో విజయం సాధించడంతో క్లీన్‌స్వీప్ చేసింది. ఇందులో ఠాకూర్ మక్కాన్‌సింగ్ మూడోసారి పోటీ చేయడం, రామగుండంలో కాంగ్రెస్‌కు వచ్చిన అనూహ్య ఆదరణ, స్థానికంగా సానుభూతి పనిచేశాయి.
- సిరిసిల్లలో కేటీఆర్(బీఆర్‌ఎస్) సునాయస విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. తన చిరకాల ప్రత్యర్థి కేకే మహేందర్‌రెడ్డిని ఐదోసారి ఓడించారు. 2009 నుంచి వీరిద్దరూ పోటీ పడటం ఐదోసారి కావడం విశేషం. కాంగ్రెస్ హవా, సానుభూతి పనిచేయలేదు.
- వేములవాడలో ఊహించినట్లుగానే ఆది శ్రీనివాస్(కాంగ్రెస్) విజయం సాధించారు. ఆయన అసెంబ్లీకి పోటీ పడటం వరుసగా ఐదోసారి. గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రమేశ్ బాబు పౌరసత్వం విషయంలో న్యాయపరంగా పోరాడినా ఫలించలేదు. ఎట్టకేలకు ప్రజల దీవెనలతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. వేములవాడ ఆలయ చైర్మన్‌గా పనిచేసిన వారు ఎమ్మెల్యేలుగా గెలవరంటూ దశాబ్దాలుగా సాగుతున్న సంప్రదాయానికి తెరదించారు. సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి చెలిమెడ లక్ష్మీనరసింహారావు, బీజేపీ అభ్యర్థి వికాస్‌రావులపై స్పష్టమైన మెజారిటీ సాధించారు.
- జగిత్యాలలో తొలుత జీవన్‌రెడ్డి పది రౌండ్ల వరకు ఆధిపత్యం కనిపించినా.. తర్వాత పుంజుకున్న సంజయ్ విజయం సాధించారు. కోరుట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ కె.సంజయ్ అనూహ్యంగా గెలిచారు. సమీప ప్రత్యర్థి ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఢీకొట్టగలరా? అన్న ప్రచారం జరిగింది. ఎగ్జిట్‌పోల్స్ కూడా అర్వింద్‌కే మొగ్గుచూపాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు ఉన్న పేరు, అనుభవం సంజయ్ గెలుపులో కీలకపాత్ర పోషించాయి. ధర్మపురిలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తన చిరకాల ప్రత్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై విజయం సాధించారు. 2009 నుంచి వీరిద్దరూ తలపడటం ఇది ఐదోసారి కావడం గమనార్హం. కాంగ్రెస్ హవా, లక్ష్మణ్‌పై సానుభూతి, అధికార పార్టీపై వ్యతిరేకత కలిసివచ్చాయి.

విశేషాలు..

- కరీంనగర్ నుంచి ఎంపీ బండి సంజయ్, కోరుట్ల నుంచి ఎంపీ అరింద్ బీఆర్‌ఎస్ అభ్యర్థుల చేతిలో పరాజయం పాలయ్యారు. వీరిద్దరూ బీజేపీ అగ్రనేతలుగా వెలుగొంది, పార్టీ ఆదేశాలతో అసెంబ్లీ బరిలో దిగారు.
- హుజూరాబాద్ నుంచి పోటీచేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి విజయం సాధించగా, జగిత్యాల నుంచి పోటీ చేసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఓడిపోయారు.
- రాష్ట్రంలో వరుసగా ఏడుసార్లు గెలిచి సరికొత్త రికార్డు సృష్టించిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఎనిమిదోసారి పోటీలో ఓడారు. ఈసారి గెలిస్తే అత్యధికసార్లు శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేగా మరో కొత్త రికార్డు సృష్టించేవారు. ఆయన పోటీచేసిన హుజూరాబాద్, గజ్వేల్‌లో రెండుచోట్ల ఓటమి పాలయ్యారు.
- ఇప్పటి వరకు ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఐదు సార్లు గెలిచిన మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరో దఫా పోటీలో తొలిసారి ఓడిపోయారు. ఈయన గెలిచి ఉంటే ఈటల రాజేందర్ ఏడు సార్లు ఎమ్మెల్యే రికార్డు సమం అయ్యేది.



జేఎన్టీయూలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు



ఈవీఎం తెరుస్తున్న అధికారులు



సెంటినరీకాలనీ జేఎన్టీయూ కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది



ఈవీఎంలతో వెళ్తున్న సిబ్బంది



బందోబస్తు పర్యవేక్షిస్తున్న డీసీపీ చేతన



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న విజయరమణారావు అనుచరుడు

ఉమ్మడి జిల్లాలో ఫలితాలు ఇలా..

కరీంనగర్: గంగుల కమలాకర్ (బీఆర్‌ఎస్), ఓట్లు: 92,179, మెజారిటీ 3,163, రెండోస్థానం: బండి సంజయ్ కుమార్ (బీజేపీ), ఓట్లు: 89,016, మూడో స్థానం: పురమల్ల శ్రీనివాస్ (కాంగ్రెస్) ఓట్లు: 40,057

పెద్దపల్లి: విజయరమణరావు (కాంగ్రెస్), ఓట్లు: 1,18,888, మెజారిటీ: 55,108, రెండో స్థానం: దాసరి మనోహర్‌రెడ్డి(బీఆర్‌ఎస్) ఓట్లు: 63,780, మూడో స్థానం: దాసరి ఉష(బీఎస్పీ), ఓట్లు 10,315.

రామగుండం: రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ (కాంగ్రెస్), ఓట్లు: 92,227, మెజారిటీ: 56,794, రెండో స్థానం: కోరుకంటి చందర్(బీఆర్‌ఎస్), ఓట్లు: 35,433, మూడో స్థానం: కందుల సంధ్యారాణి(బీజేపీ), ఓట్లు: 12,966

మంథని: దుద్దిళ్ల శ్రీధర్ బాబు (కాంగ్రెస్), ఓట్లు: 1,03,822 మెజారిటీ: 31,380, రెండో స్థానం: పుట్ట మధు (బీఆర్‌ఎస్), ఓట్లు: 72,442, మూడో స్థానం: సునీల్ రెడ్డి (బీజేపీ), ఓట్లు: 5,779

మానకొండూరు: సత్యనారాయణ (కాంగ్రెస్) పొందిన ఓట్లు: 96,773 మెజారిటీ : 32,365, రెండో స్థానం: రసమయి బాలకిషన్ (బీఆర్‌ఎస్), ఓట్లు: 64,408, మూడో స్థానం : ఆరెపల్లి మోహన్ (బీజేపీ) ఓట్లు: 14,879

చొప్పదండి: మేడిపల్లి సత్యం, పార్టీ: కాంగ్రెస్ ఓట్లు : 90,395, మెజారిటీ: 37,439, రెండో స్థానం: సుంకె రవిశంకర్ పార్టీ: (బీఆర్‌ఎస్) ఓట్లు : 52,956, మూడో స్థానం : బొడిగె శోభ గాలన్న, (బీజేపీ) ఓట్లు : 26,669

హుజూరాబాద్: పాడి కౌశిక్ రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 80,333 , మెజార్టీ: 16,873, రెండో స్థానం: ఈటల రాజేందర్ (బీజేపీ), ఓట్లు : 63,460, మూడో స్థానం : ఒడితల ప్రణవ్ (కాంగ్రెస్) ఓట్లు :53,164

హుస్నాబాద్: పొన్నం ప్రభాకర్ (కాంగ్రెస్), ఓట్లు: 1,00,955 , మెజార్టీ:19,344, రెండో స్థానం: ఒడితల సతీశ్ కుమార్, ఓట్లు: 81,611, మూడో స్థానం: బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఓట్లు: 8338

సిరిసిల్ల: తారక రామారావు, (బీఆర్‌ఎస్), ఓట్లు: 89,244, మెజారిటీ: 29,687, రెండో స్థానం: కేకే మహేందర్ రెడ్డి (కాంగ్రెస్), ఓట్లు: 59,557, మూడో స్థానం: రాణిరుద్రమారెడ్డి(బీజేపీ) 18, 328

వేములవాడ: ఆది శ్రీనివాస్ (కాంగ్రెస్) ఓట్లు: 71451.మెజారిటీ: 14,581, రెండో స్థానం: చెలిమెడ లక్ష్మీనర్సింహారావు (బీఆర్‌ఎస్). ఓట్లు: 56,870, మూడో స్థానం: చెన్నమనేని వికాస్‌రావు (బీజేపీ), ఓట్లు: 29,710.

జగిత్యాల: సంజయ్‌కుమార్ (బీఆర్‌ఎస్), ఓట్లు: 70,243, మెజారిటీ: 15822, రెండోస్థానం : టి.జీవన్‌రెడ్డి (కాంగ్రెస్), ఓట్లు : 54,421, మూడోస్థానం : బోగ శ్రావణి (బీజేపీ), ఓట్లు : 42,138

కోరుట్ల: సంజయ్ (బీఆర్‌ఎస్), ఓట్లు : 72,115, మెజారిటీ: 10,305, రెండోస్థానం: ధర్మపురి అర్వింద్ (బీజేపీ), ఓట్లు : 61,810, మూడో స్థానం : జువ్వాడి నర్సింగారావు (కాంగ్రెస్), ఓట్లు : 39,647

ధర్మపురి: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (కాంగ్రెస్), ఓట్లు: 91,393, మెజారిటీ: 22,039, రెండోస్థానం: కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్), ఓట్లు: 69,354, మూడో స్థానం : ఎస్.కుమార్ (బీజేపీ), ఓట్లు: 7,345



ఓట్ల లెక్కింపులో నిమగ్నమైన అధికారులు



పోస్టల్ బ్యాలెట్ పత్రాలు సరిచూస్తున్న సిబ్బంది



విజయరమణారావును అభినందిస్తున్న ఉష

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవాలు

- పెద్దపల్లి, రామగుండం, మంథనిలో అంబరాన్ని అంటిన సంబురాలు

గోదావరిఖని: రామగుండం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విజయం సాధించడంపై ఆ పార్టీ శ్రేణులు ఆదివారం పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మంథని జేఎన్టీయూ కౌంటింగ్ కేంద్రం నుంచి యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ మీదుగా గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగించారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో..

జ్యోతినగర్(రామగుండం): ఐఎన్టీయూసీ నాయకులు ఎన్టీపీసీలో సంబురాలు జరుపుకున్నారు. రామగుండం ఎమ్మెల్యేగా రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ విజయంతోపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయంపై ఎన్టీపీసీ ఉద్యోగ గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా ఆదేశాలతో నాయకులు బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. నాయకులు కాసర్ల వెంకటస్వామి, బండారి కనకయ్య, కందుల స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్, ఎం.శ్రీనివాస్, మేరుగు రాజనర్సయ్య, వేముల కృష్ణయ్య, బొద్దుల శ్రీనివాస్, నేరెళ్ల రమేశ్, వేముల మల్లేశ్, కట్ట రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయారు. శ్రీధర్‌బాబు గెలుపుకోసం పార్టీ శ్రేణులు నెల రోజుల పాటు నిర్విరామంగా కృషి చేశారు. ఆయన గెలుపుతో పెద్దఎత్తున బాణసంచా కాల్చుతూ స్వీట్లు పంచారు. అన్ని గ్రామాల్లో సంబురాలు మిన్నంటాయి. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. విజయం సొంతం కావడంతో అప్పటివరకు మంథనిలో ఉన్న ఎమ్మెల్యే.. రామగిరి జేఎన్టీయూ కౌంటింగ్ కేంద్రం వరకు పెద్ద ఎత్తున శ్రేణులతో కలిసి తరలి వచ్చారు. అంతకు ముందు మంథని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే తన తండ్రి దివంగత శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్ (పెద్దపల్లి): పెద్దపల్లి, మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన చింతకుంట విజయ రమణారావు, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు వారిని సన్మానించారు. దారి పొడవునా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ, భారీ ఆధిక్యం ఇచ్చిన ఓటర్లకు సేవకుడిగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్వల శ్రీనివాస్, అక్బర్ అలీ, దామోదర్‌రావు, అన్నయ్యగౌడ్, పుష్పలత, రాజయ్య, రఫిక్, రాజు, వరప్రదీప్, రవీందర్, కిశోర్, సంతోష్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, ప్రశాంత్‌రావు, లక్ష్మణరావు, పురుషోత్తంరావు, సంపత్‌రావు, సతీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో మక్కాన్‌సింగ్ విజయోత్సవం



వియజరమణారావును సన్మానిస్తున్న నేతలు



విజయ సంకేతం చూపుతున్న శ్రీధర్‌బాబు

ఆదినుంచీ ఆధిక్యమే..



గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ ఆది నుంచీ ఆధిక్యం కనబర్చింది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్య పోటీ సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌ఠాకూర్ తొలిరౌండ్‌లోనే 4,571ఓట్ల ఆధిక్యం కనబర్చారు. ఇలా ప్రతీ రౌండ్‌లో మూడు నుంచి నాలుగువేలకుపైగా మెజార్టీ సాధించారు. అన్నిరౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌ఠాకూర్ దూసుకుపోయారు. ఇలా 19రౌండ్లు ముగిసేసరికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజ్‌ఠాకూర్ 92,227 ఓట్లు సాధించి సమీప అభ్యర్థి చందర్‌పై 56,794ఓట్లు ఆధిక్యం సాధించారు. 35,443ఓట్లు సాధించి కోరుకంటి చందర్ రెండోస్థానంలో నిలవగా, బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి 12,966 ఓట్లు సాధించి మూడోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ 4,048 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు.

గుర్తింపు ఎన్నికలకు కౌంట్‌డౌన్

- నేడు డిప్యూటీ సీఎల్‌సీ వద్ద సమావేశం
- 27న కార్మిక సంఘాల ఎన్నికలు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. ఈక్రమంలో సోమవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎల్‌సీ సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు అన్ని యూనియన్ల నాయకులు, సింగరేణి యాజమాన్యానికి ఇప్పటికే లేఖలు పంపించారు. ఈనెల 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈమేరకు కార్మిక నేతలు నేడు హైదరాబాద్ తరలివెళ్తున్నారు. ఈసమావేశంలో యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు భేటీ కానున్నారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లో 39,600మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, రహస్య బ్యాలెట్ పద్ధతిన సంస్థలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వచ్చేనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎల్‌సీ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈమేరకు ఈనెల 4న సీఎల్‌సీ కార్యాలయంలో హాజరు కావాలని 13కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యానికి లేఖ రాశారు. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా, ఎన్నికల విధివిధానాలు ఖరారు చేయనున్నారు. గతంలో ఉన్న పద్ధతి ప్రకారం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం లెక్కన ఎన్నికలు నిర్వహిస్తారా? లేక ఈసారి మార్చుతారా? అనే విషయం తేలాల్సి ఉంది. రెండు ఓట్ల పద్ధతిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను కార్మికులు సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిన ఎన్నుకుంటారు. ఇప్పటివరకు అసెంబ్లీ వేడితో కార్మిక క్షేత్రం బిజీగా మారగా, గుర్తింపు ఎన్నికల ప్రక్రియకు ముందడుగు పడనుంది.



క్లుప్తంగా

ధర్మపురిలో అడ్లూరి విజయం


అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌

గోదావరిఖని: ధర్మపురి అసెంబ్లీ ఎన్నికల్లో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ విజయం సాధించారు. ఈ పోటీలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కార్మిక క్షేత్రానికి చెందిన వారే ఉన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌, కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌, బీజేపీ అభ్యర్థిగా ఎస్‌.కుమార్‌ బరిలో ఉన్నారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో ఉన్న కార్మిక బిడ్డ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు 91,393 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 69,354ఓట్లు సాధించారు. 22,039ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. ఈప్రాంతానికి చెందిన లక్ష్మణ్‌కుమార్‌ గెలుపొందడంతో ఆనందోత్సవాలు జరుపుకున్నారు.

పట్టు వదలని విక్రమార్కుడిలా..

గోదావరిఖని: తన జీవితమంతా రామగుండం ప్రజలతోనే అంటూ పట్టువదలని విక్రమార్కుడిలా పోరాటం చేశారు కాంగ్రెస్‌ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌. 15ఏళ్ల పోరాటం తర్వాత కాంగ్రెస్‌ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖరరెడ్డి హయాంలో శాప్‌ చైర్మన్‌గా పనిచేసిన రాజ్‌ఠాకూర్‌.. రామగుండం నియోజకవర్గంలో పలుసార్లు పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2009లో నామినేషన్‌ వేసి చివరి క్షణంలో విరమించుకున్నారు. 2014లో ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా బరిలో దిగి ఓడిపోయారు. 2018లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా ఓటమి పాలయ్యారు. సుదీర్ఘ పోరాటం తర్వాత 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సమీప అభ్యర్థి కోరుకంటి చందర్‌పై భారీ మెజార్టీతో విజయం సాధించారు. తను ఎంచుకున్న సొంతగడ్డపై విజయాన్ని కైవసం చేసుకుని తన జీవితాశయాన్ని నెరవేర్చుకున్నారు.

ఉద్యోగాల నిలిపివేత

జ్యోతినగర్‌(రామగుండం): ఎన్టీపీసీ నిర్వాసితుల ఉద్యోగ నియామకాల్లో భాగంగా ఆరుగురి నియామకాలను నిలిపివేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు విడుదలచేశారు. 01/2022 ఉద్యోగ నియామక ప్రకటనలో 25 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించేందుకు నోటిఫికేషన్‌ విడుదల చేశారు. ఈ క్రమంలో రాత పరీక్షతోపాటు ధ్రువీకరణ పత్రాల పరిశీలన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇటీవల 25 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు నియామకపు ఉత్తర్వుల జాబితా విడుదల చేశారు. 25 మంది నిర్వాసితుల్లో 18 మంది ఉద్యోగంలో చేరారు. ఒకరు మెడికల్‌ ఫిట్‌ కాలేకపోవడంతో ఆయన నియామకం నిలిపివేశారు. మిగతా ఆరుగురిని వివిధ కారణాలతో ఉద్యోగ నియామకాల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో ఉద్యోగ నియామకాల్లో పూర్తిస్థాయి పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయకపోవడంతోనే పలువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ధ్రువీకరణ పత్రాలను పునఃపరిశీలించి నియామకాలను నిలుపుదల చేసినట్లు సమాచారం.

నోటాకు పెరుగుతున్న ఓటు

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో ఆదివారం లెక్కించిన అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు 1,572ఓట్లు వచ్చాయి. ఈసారి ఎన్నికల్లో నోటాకు ఓట్ల సంఖ్య పెరిగింది. గత రెండుసార్లు జరిగిన ఎన్నికల కన్నా ఈసారి నోటావైపు ఎక్కువ మంది ఆసక్తి చూపారు 2014 ఎన్నికల్లో నోటాకు 619ఓట్లు రాగా, 2018 ఎన్నికల్లో 1,078మంది నోటాకు ఓటువేశారు. ప్రస్తుతం రామగుండం నియోజకవర్గంలో 23 మందిఅభ్యర్థులు బరిలో ఉండగా, 19మంది అభ్యర్థులు నోటా ఓట్లను మించి సాధించలేకపోవడం గమనార్హం.

55మంది డిపాజిట్లు గల్లంతు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 61మంది అభ్యర్థులు బరిలో నిలవగా వారిలో 55మంది డిపాజిట్‌ కోల్పోయారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు మినహా మిగతా పార్టీలు, ఇండిపెండెంట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఇందులో పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష, బీజేపీ అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌రావు, రామగుండం బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి, స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే సోమారాపు సత్యనారాయణ, బీఎస్పీ అభ్యర్థి అంబటి నరేశ్‌, మంథని బీజేపీ అభ్యర్థి చందుపట్ల సునీల్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి ఉండటం గమనర్హాం.

నోటా కంటే తక్కువ ఓట్లు

ఎన్నికల్లో పోలింగ్‌ శాతం పెంచేలా, అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోయినా నోటా(నన్‌ ఆఫ్‌ ద ఎబౌ) ఆప్షన్‌ను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. దీంతో జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో కలిపి 3199ఓట్లు నోటాకు పడ్డాయి. ఇందులో పెద్దపల్లిలో నోటాకు పడిన 865ఓట్ల కన్నా 9మందికి నోటా కంటే తక్కువగా ఓట్లు వచ్చాయి. అలాగే మంథనిలో 762నోటా ఓట్లు పడగా, 14మందికి నోటా కన్నా తక్కువగా, రామగుండంలో నోటాకు 1572ఓట్లుపడగా, 19మందికి నోటా కన్నా తక్కువగా ఓట్లు వచ్చాయి.



డిపాజిట్‌ గల్లంతు అంటే

అభ్యర్థులు తమ నామినేషన్‌ ఫారంతోపాటు నిర్ణీత డిపాజిట్‌(ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. జనరల్‌ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5000 డిపాజిట్‌ చెల్లించాలి. అయితే, పోలైన చెల్లిన ఓట్లలో ఆరోవంతుకు మించిన ఓట్లు అభ్యర్థులకు వస్తేనే సదరు ఆ డిపాజిట్‌ తిరిగి చెల్లిస్తారు. లేదంటే ఆ డిపాజిట్‌ను ప్రభుత్వమే జప్తు చేస్తుంది. దీనినే డిపాజిట్‌ గల్లంతు అంటారు. ఎన్నికల ఫలితాలు కేంద్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురితమయ్యాకే అర్హులైన అభ్యర్థులకు డిపాజిట్‌ తిరిగి ఇచ్చేస్తారు.

మరికొందరికి నోటా కన్నా తక్కువ ఓట్లు నోటా ఓట్లు

రామగుండం	1572
మంథని	762
పెద్దపల్లి	865
మొత్తం	3199

డిపాజిట్‌ గల్లంతైన వారు

అసెంబ్లీ	పోలైనవి	డిపాజిట్‌ఓట్లు	అభ్యర్థులు	గల్లంతైనవారు
రామగుండం	151865	25,310	23	21
మంథని	195635	32,605	21	19
పెద్దపల్లి	207397	34,566	17	15

35ఏళ్ల తర్వాత ఎగిరిన కాంగ్రెస్‌ జెండా

- ఆరుసార్లు 'చేతి'కి పరాజయం





పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీపడ్డ విజయరమణారావు 55,108ఓట్ల మెజార్టీ సాధించి కాంగ్రెస్‌ జెండాను 35 ఏళ్ల తర్వాత ఎగురేశారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆఖరు సారిగా 1989లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా గీట్ల ముకుందరెడ్డి పోటీచేసి సమీప టీడీపీ అభ్యర్థి బిరుదు రాజమల్లుపై విజయం సాధించారు. ఆ తర్వాతి నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థులుగా పోటీచేసినా ఓటర్ల ఆదరణ పొందలేక పోయారు. 1989 తర్వాతి నుంచి జరిగిన ఎన్నికల్లో 1994లో బిరుదు రాజమల్లు, 1999లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల రామకృష్ణారెడ్డి, 2004లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గీట్ల ముకుందరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 2009లో టీడీపీ 2014, 2018లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థులనే ప్రజలు ఎన్నుకున్నారు.

మూడు దశాబ్దాల తర్వాత..

పెద్దపల్లి అసెంబ్లీ నియోజకర్గం నుంచి కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి 35 ఏళ్లుగా విజయం సాధించలేకపోయింది. కాంగ్రెస్‌ పార్టీకే పట్టున్న పెద్దపల్లి నియోజకవర్గంపై టీడీపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలే కొన్నేళ్లుగా ఆధిపత్యాన్ని చలాయించాయనడంలో సందేహం లేదు. 1989లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా గీట్ల ముకుందరెడ్డి తన సమీప ప్రత్యర్థి బిరుదు రాజమల్లుపై గెలుపొందారు. ఆ తర్వాతి నుంచి కాంగ్రెస్‌ పార్టీ వరుసగా జరిగిన ఎన్నికల్లో పోటీపడ్డా విజయం సాధించడంలో విఫలమైంది. కానీ ఈ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీపడ్డ విజయరమణారావు 55,108 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు.

పెద్దపల్లి సమాచారం..

సంవత్సరం	విజేత	పార్టీ
1989	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్‌
1994	బిరుదు రాజమల్లు	టీడీపీ
1999	గుజ్జుల రామకృష్ణారెడ్డి	బీజేపీ
2004	గీట్ల ముకుందరెడ్డి	బీఆర్‌ఎస్‌
2009	విజయరమణారావు	టీడీపీ
2014	దాసరి మనోహర్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
2018	దాసరి మనోహర్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
2023	విజయరమణారావు	కాంగ్రెస్‌

మంత్రి రేసులో ముగ్గురు..?

- మాజీ మంత్రి శ్రీధర్‌బాబుకు కీలకశాఖ వచ్చే అవకాశాలు
- రేసులో పొన్నం, విజయరమణారావు

సాక్షి, పెద్దపల్లి: సంపూర్ణ మెజార్టీ సాధించటంతో కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నది. అయితే, కొత్త ప్రభుత్వంలో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా నుంచి మంత్రి పదవులు దక్కించుకునేవారిపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నత విద్య, శాసనసభ వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఈసారి కీలకమైన మంత్రి పదవి వచ్చే అవకాశాలున్నాయని ఆయన అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈసారి శ్రీధర్‌బాబు చేపట్టబోయే మంత్రిత్వశాఖపై మంథని నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆసక్తినెలకొంది. ఉప ముఖ్యమంత్రి లేదా హోంశాఖ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని కాంగ్రెస్‌ శ్రేణులు భావిస్తున్నాయి. కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు టి.జీవన్‌రెడ్డి జగిత్యాల నుంచి ఓటమిపాలవగా, కాంగ్రెస్‌ తరఫున గెలిచిన అభ్యర్థుల్లో సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌, చింతకుంట విజయరమణారావు పేర్లు అధిష్టానం పరిశీలించవచ్చనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన విజయరమణారావుకు మంత్రిపదవి దక్కకపోయినా విప్‌గా పదవి లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన అభిమానులు చెబుతున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మంథని: గుంజపడుగులో కాంగ్రెస్‌ సంబరాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. సంబరాల్లో భాగంగా గ్రామంలో విగ్రహం చుట్టూ ట్రాక్టర్‌ తిప్పుతుండగా అదుపుతప్పి బోల్తాపడింది. గ్రామానికి చెందిన గుర్రం సతీశ్‌కు తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వేములవాడఅర్బన్‌: వేములవాడ మున్సిపల్‌ పరిధి తిప్పాపూర్‌లోని మూల వాగు ఒడ్డున ఉన్న బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహమున్నట్లు స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రాత్రి కావడంతో పూర్తి వివరాలు తెలియరాలేదని తెలిపారు.

అందరి చూపు.. మీడియా సెంటర్‌ వైపు

- పెద్ద డిజిటల్‌ స్క్రీన్‌పై ఎన్నికల ఫలితాలు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఎన్నికల ఫలితాలను పెద్ద స్క్రీన్‌పై వీక్షిస్తూ.. సిరిసిల్ల, వేములవాడ ఎన్నికల ఫలితాలను నమోదు చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు విధుల్లో ఉన్న పోలీస్‌ అధికారులు, ఇతర అధికారులు సైతం మీడియా సెంటర్‌లోని పెద్ద స్క్రీన్‌ను చూస్తూ.. రాష్ట్ర స్థాయి, ఐదు రాష్ట్రాల్లోని ఎన్నికల ఫలితాలను వీక్షించారు. డీపీఆర్వో మామిండ్ల దశరథం ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మీడియా ప్రతినిధులను దశలవారీగా అధికారుల అనుమతితో తీసుకెళ్లారు. ఎన్నికల ఫలితాలను రౌండ్లవారీగా డీపీఆర్వో సిబ్బంది అందించారు. మీడియా సెంటర్‌లోని బిగ్‌ స్క్రీన్‌ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


మీడియా సెంటర్‌లో పాత్రికేయులు

క్షుణ్ణంగా తనిఖీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల):సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు. మూడంచల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి కౌంటింగ్‌ కేంద్రాలకు వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కౌంటింగ్‌ పాసులు, ఏజెంట్‌ పాసులు ఉన్నవారినే లోపలికి అనుమతించారు. సెల్‌ఫోన్లను లోపలికి అనుమతించకపోవడంతో కొందరు ఏజెంట్లు ఇబ్బందులుపడ్డారు. సెల్‌ఫోన్లను వేరే వాళ్లకి అప్పగించి ఆ తరువాత లోపలికి వెళ్లాల్సి వచ్చింది. పోలీసులు ఏర్పాటు చేసిన పటిష్టమైన భద్రతతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు.

గోవిందరావుపేట తండాలో దొంగతనం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని గోవిందరావుపేటతండాకు చెందిన లౌడ్యా తేజ్‌ కిరాణాషాపులో ఆదివారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. గోవిందరావుపేటకు వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై కిరాణాషాపు నిర్వహించుకుంటున్న తేజ్‌ శనివారం రాత్రి తాళం వేసి వెళ్లాడు. ఆదివారం ఉదయం చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో పరిశీలించారు. దుకాణంలో ఉన్న రూ.3,500 నగదు, రూ.1500 విలువైన సిగరెట్‌ ప్యాకెట్లు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయమై కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

మల్లన్నకు మొక్కులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల పూజలు చేశారు. స్వామివారిని దర్శనం చేసుకుని పట్నాలు వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



రాజ్‌ఠాకూర్‌కే పట్టం కట్టిన కార్మికులు

- ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్‌ మద్దతు
- కాంగ్రెస్‌ వైపు మళ్లిన కార్మికుల ఓట్లు


సింగరేణి కార్మికులు

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్‌ అభ్యర్థి ఎంఎస్‌ రాజ్‌ఠాగూర్‌ గెలుపులో కార్మికుల ఓట్లు కీలకంగా మారాయి. కార్మికులు అభ్యర్థి రాజ్‌ఠాగూర్‌కే పట్టం కట్టారని భావిస్తున్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పార్టీకి అనుబంధంగా ఉన్న ఐఎన్‌టీయూసీ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, మరో యూనియన్‌ హెచ్‌ఎంఎస్‌ రాజ్‌ఠాగూర్‌కు మద్దతు ప్రకటించాయి. గనులపై మీటింగ్‌లు నిర్వహించే క్రమంలోనూ ఈ యూనియన్లు కీలకపాత్ర పోషించాయి. కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు సుమారు 20వేల మంది నివాసముంటున్నారు. నియోజకవర్గంలో నివాసముంటూ ఆర్జీ–1,2,3, ఏఎల్‌పీ, శ్రీరాంపూర్‌, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలో సుమారు 12 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరితో పాటు సుమారు 8వేల మందికిపైగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. ఈక్రమంలో రామగుండంలో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి ఎంఎస్‌ రాజ్‌ఠాగూర్‌ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. ఈసారి కాంగ్రెస్‌కు, సీపీఐకి అనుంబంధంగా ఉన్న ఏఐటీయూసీ యూనియన్‌ మద్దతు పలికింది. హెచ్‌ఎంఎస్‌ యూనియన్‌ మద్దతు ప్రకటిందింది. దీంతో కార్మిక క్షేత్రంలో రెండు యూనియన్ల కార్మికులు కాంగ్రెస్‌ పార్టీకి మెజార్టీ సాధించడంలో వీరి ఓట్లు కీలకంగా మారినట్లు భావిస్తున్నారు. గనులపైకి వెళ్లిన సమయంలో కార్మికుల నుంచి మంచి స్పందన లభించింది. మహిళా కార్మికుల విషయంలో యాజమాన్యం ఇబ్బందులకు గురిచేయడం, తమ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తానని రాజ్‌ఠాగూర్‌ హామీ ఇవ్వడం కార్మికుల్లో స్పందన లభించింది. ఏది ఏమైనా ఈసారి జరిగిన ఎన్నికల్లో పారిశ్రామిక ప్రాంతంలో కార్మికుల ఓట్లు కీలకంగా మారాయి.

19 మంది అభ్యర్థుల డిపాజిట్‌ గల్లంతు

మంథని: నియోజకవర్గం నుంచి 21మంది అభ్యర్థులు పోటీచేయగా 19మంది డిపాజిట్‌ గల్లంతయింది. నియోజకవర్గంలో 1,96,639 ఓట్లు పోల్‌ కాగా కాంగ్రెస్‌ అభ్యర్థి శ్రీధర్‌బాబుకు 1,03,822, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పుట్ట మధుకు 72,442 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డికి 2937, బీజేపీ అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డికి 5,779 ఓట్లు వచ్చాయి. ఆల్‌ ఇండియా పార్వర్ట్‌ బ్లాక్‌ అభ్యర్థి అజిత్‌ కుమార్‌కు 566, అలయెన్స్‌ ఆఫ్‌ డెమోక్రటిక్‌ రిఫార్మ్స్‌ పార్టీ అభ్యర్థి ఆర్ల నాగరాజుకు 2,414, తెలంగాణ లేబర్‌ పార్టీ అభ్యర్థి ఇరుగురాల సంతోష్‌కు 346, ఆబాద్‌ పార్టీ అభ్యర్థి మహేందర్‌కు 551, ధర్మ సమాజ్‌ పార్టీ అభ్యర్థి చిట్యాల శ్రీనివాస్‌కు 311, ప్రజారాజ్య సమితి అభ్యర్థి దుర్గం నాగేశ్వర్‌ రావుకు158, భారతీయ స్వదేశీ కాంగ్రెస్‌ అభ్యర్థి నూనె సంజీవ్‌కు 200ఓట్లు వచ్చాయి. స్వతంత్రులు అరికెల్ల రామకృష్ణ 845, కిషన్‌రావు 1404, కిరణ్‌కుమార్‌, 913, చల్లా లక్ష్మణ్‌ 311, నూనె రాజేశం765, అన్వేష్‌ పోతుల 270, పోతుల రాజేశ్‌కన్న 533, బుట్టి దామోదర్‌ 621, మడెం వెంకటేశ్‌ 456, రాణవేన లక్ష్మణ్‌ 123 ఓట్లు వచ్చాయి. నోటాకు 776 రాగా 96 ఓట్లు రిజక్ట్‌ అయినట్లు ఆర్‌ విడుదల చేసిన ఆర్వో పేర్కొన్నారు.

అన్ని రౌండ్లలోనూ శ్రీధర్‌బాబు ఆధిక్యం

మంథని: నియోజకర్గ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 21 రౌండ్లు ఓట్ల లెక్కింపు చేయగా అన్నిరౌండ్లలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హవా కొనసాగింది. నియోజకవర్గంలో పది మండలాల్లో కమాన్‌పూర్‌, మంథని మండలాల్లో బీఆర్‌ఎస్‌ ఆధిక్యం వస్తుందని భావించగా మొదట లెక్కించిన రామగిరి, కమాన్‌పూర్‌, మంథని మండలాలతో పాటు కాటారం, మహాముత్తారం, మల్హర్‌, మహాదేవపూర్‌, పలిమెల, ముత్తారం మండలాల్లో శ్రీధర్‌బాబు ఆధిక్యం కొనసాగించారు. ఒకటో రౌండ్‌లో 790, రెండో రౌండ్‌లో 1474, మూడవ రౌండ్‌లో 1162, నాలుగు రౌండ్‌, 1665, ఐదవ రౌండ్‌ 1492, ఆరవ రౌండ్‌ 1537, ఏడవ రౌండ్‌ 744, ఎనిమిదివ రౌండ్‌లో 1678, తొమ్మిదవ రౌండ్‌లో 439, పదో రౌండ్‌లో 1953 మెజార్టీని శ్రీధర్‌బాబు కొనసాగించారు. 11వ రౌండ్‌లో 3576, 12వ రౌండ్‌లో 2465, 13వ రౌండ్‌లో 1263, 14వ రౌండ్‌లో 1215, 15వ రౌండ్‌లో 307, 16 వ రౌండ్‌లో 336, 17వ రౌండ్‌లో 1601, 18వ రౌండ్‌లో 1953, 19వ రౌండ్‌లో 1882, 20వ రౌండ్‌లో 1856, 21లో 1163 ఓట్ల ఆధిక్యం సాధించారు. పోస్టల్‌ బ్యాలెట్లలోనూ 312 ఆధిక్యతను శ్రీధర్‌బాబు కొనసాగించారు. బీఆర్‌ఎస్‌ శ్రేణులు తమకు అనుకూలంగా ఉంటాయనుకున్న మండలాల్లోనూ కాంగ్రెస్‌ ఆధిక్యత చాటింది. వార్‌ వన్‌ సైడ్‌ అన్నట్లుగా 2018 ఎన్నికల మెజారిటీ కంటే మూడింతల మెజార్టీని శ్రీధర్‌బాబు సాధించారు.

కమలం డిపాజిట్లు గల్లంతు

- 1999లో ఒకేసారి విజయం
- ఆ తర్వాత వరుస పరాజయాలు

పెద్దపల్లిరూరల్‌: అంతర్గత కుమ్ములాటలతో డీలా పడుతున్న కమలనాథులు మరింత ఆందోళనలో పడిపోయారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపుతో ఈ విషయం స్పష్టమైంది. జిల్లా కేంద్రంగా పెద్దపల్లి అసెంబ్లీ స్థానం నుంచి 1999లో అప్పటి టీడీపీ నుంచి పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన గుజ్జుల రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత నుంచి వరుసగా పరాజయాలే చవిచూశారు. ఈసారి కేవలం 6,312 ఓట్లతోనే సరిపెట్టుకున్నారు. డిపాజిట్‌ గల్లంతు కావడంతో కాషాయ పార్టీలో అంతర్మథనం మొదలైంది. గత ఎన్నికల్లో పోటీపడ్డ గుజ్జుల రామకృష్ణారెడ్డి 9,042 ఓట్లను సాధించగా ఈసారి అంతకన్నా తక్కువ ఓట్లనే ప్రదీప్‌కుమార్‌ పొందగలిగారు.

ప్రచార ప్రభావమెంత..!

ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా సహా అగ్రనేతలు, పలు రాష్ట్రాల సీఎం, మంత్రులు, కేంద్రమంత్రులు విస్తృతంగా ఎన్నికల ప్రచారసభలు, రోడ్‌షోలు నిర్వహించారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఆఖరిగడియల్లో ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు ఖరారు చేశారు. ఆయనకు మద్దతుగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పెద్దపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. రామగుండం నియోజకవర్గానికి చెందిన సోమారపు సత్యనారాయణ పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతల నుంచి, పార్టీ నుంచి తప్పుకోవడంతో అనూహ్యంగా జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణికి పోటీచేసే అవకాశం దక్కింది. అలాగే మంథని నియోజకవర్గం నుంచి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి పోటీపడ్డారు.

ప్రచారానికి దూరంగా 'గుజ్జుల'

పెద్దపల్లి నుంచి బీజేపీ అభ్యర్థిత్వం కోసం మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి పోటీపడ్డారు. వీరే కాకుండా కొత్తగా పెద్దపల్లి మున్సిపల్‌ కౌన్సిలర్‌ కొలిపాక శ్రీనివాస్‌, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, బీఆర్‌ఎస్‌ నేత నల్ల మనోహర్‌రెడ్డి విఫలయత్నం చేశారు. చివరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రదీప్‌రావుకే అవకాశం దక్కడంతో టికెట్‌ ఆశించి భంగపడ్డ గుజ్జుల వర్గీయుల్లో కొందరు బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు.

అన్నీతామై శ్రమించిన కుటుంబసభ్యులు

- భర్తను ఎమ్మెల్యేగా గెలుపించుకున్న భార్య
- తండ్రి గెలుపు కోసం ప్రచారం నిర్వహించిన కూతుళ్లు
- అన్న గెలుపు కోసం తమ్ముడు శ్రీనుబాబు మంత్రాంగం

సాక్షి, పెద్దపల్లి: అన్ని పార్టీల్లో తమ నేతలను గెలిపించుకోవడానికి అనుచరులు, కార్యకర్తలు కష్టపడుతుంటారు. అయితే, ఎన్నికల వేళ కొత్తగా వచ్చిన వారితోపాటు కోవర్టుల బెడద అధికంగా ఉంటుంది. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి నెలకొంటుంది. దీంతో చాలామంది అభ్యర్థులు తమ కటుంబసభ్యులకే ఎక్కువగా ఆర్థికపరమైన అంశాలతోపాటు, ప్రచార బాధ్యతలు అప్పగిస్తారు. అయితే జిల్లాలోని కాంగ్రెస్‌ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసిన వారి కుటుంబసభ్యులు అన్నీతామై ఆర్థికఅంశాలతో పాటు, ప్రచార బాధ్యతలు చక్కగా నిర్వహించి వారి విజయానికి పాటుపడ్డారు. కాంగ్రెస్‌ అభ్యర్థులు రాజ్‌ఠాకూర్‌ మక్కాన్‌సింగ్‌కు తోడుగా భార్య మనాలి ఠాకూర్‌, కూతురు మానస తమదైన శైలిలో ప్రచారం నిర్వహించారు. విజయరమణరావుకు అండగా భార్య పావని, కూతరు వైష్ణవి ప్రచారం చేశారు. శ్రీధర్‌బాబుకు తోడుగా తమ్ముడు శ్రీనుబాబు అన్ని వ్యవహారాలు చక్కబెట్టారు.


విజయరమణారావు గెలుపుకోసం భార్య పావని


శ్రీధర్‌బాబు గెలుపుకోసం తమ్ముడు శ్రీనుబాబు ప్రచారం


తండ్రి గెలుపుకోసం మక్కాన్‌సింగ్‌ కూతురు